క్లుప్తంగా

4,500 మందికి అన్నసమారాధన



అన్నసమారాధనలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బలిజిపేట: మండలకేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయకుడి విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 4,500మంది భక్తులు ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. బలిజిపేట, వెంగాపురం, పలగర, చిలకలపల్లి, తుమరాడ తదితర గ్రామాలకు చెందిన భక్తులు, కళాశాలల విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు ప్రసాదాన్ని స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు.

జూట్ కార్మికుల దీక్షకు అంగన్వాడీల మద్దతు



కార్మికుల దీక్షకు మద్దతు తెలుపుతున్న అంగన్వాడీలు

సాలూరు: మండలంలోని జీగిరాం జూట్‌ఫ్యాక్టరీని తెరవాలని డిమాండ్ చేస్తూ కార్మిక జేఏసీ చేపట్టిన దీక్షకు అంగన్వాడీలు మద్దతు తెలిపారు. ఫ్యాక్టరీ ఆవరణలో దీక్ష చేస్తున్న కార్మికులను సోమవారం అంగన్వాడీలు కలిశారు. యాజమాన్యం తక్షణమే స్పందించి, ఫ్యాక్టరీ తెరిచి కార్మికులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు రాజమ్మ, పోలమ్మ, మరియమ్మ తదితరులు ఉన్నారు.

బట్టి కాలువకు మెట్లనిర్మాణం



పెదపెంకిలో పనులు జరిపిస్తున్న సంజీవనాయుడు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో బట్టి కాలువకు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు రూ.5వేలు తన సొంతనిధులతో మెట్ల నిర్మాణం జరిపిస్తున్నారు. బస్టాండ్ సమీపంలో పెదంకలాం కాలువ నీటిని గ్రామస్తులు వినియోగించుకునేందుకు వీలుగా మెట్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకుని వచ్చిన తరువాత మార్గమధ్యంలో కాలువ నీటిలో స్నాన, పానాదులు చేసుకునేందుకు వీలుగా ఉంటుందని భావించిన నిర్మించినట్లు తెలిపారు.


ఇళ్లలోనే వైద్య పరీక్షలు



వెంకటాపురంలో ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రజలకు వారిళ్లలోనే వైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్యసిబ్బంది 7 రకాల పరీక్షలు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం వెంకటాపురం, బూర్జ గ్రామాల్లో పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు రోగనిర్ధారణ పరీక్షలు చేశారు. అలాగే సీతానగరం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న మరిపివలసలో సీహెచ్‌ఓలు నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని డాక్టర్ శిరీష పరిశీలించి తగుసూచనలు ఇచ్చారు.

తేడాలుంటే చర్యలు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారి

బలిజిపేట: ఎరువుల దుకాణాల్లో ఎటువంటి తేడాలున్నా చర్యలు తప్పవని పార్వతీపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు బలిజిపేటలోని ఎరువుల దుకాణాలను ఆయన సోమవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టాకులు, బిల్లు పుస్తకాలు, రశీదులను పరిశీలించారు. షాపుల వద్ద ఎటువంటి తేడాలు కనిపించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, వాస్తవ ధరలకే విక్రయాలు జరపాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష మాక్‌డ్రిల్



జగనన్న ఆరోగ్య సురక్ష మాక్ డ్రిల్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు చెప్పారు. ఈ మేరకు అడ్డాపుశీల గ్రామంలో మాక్ డ్రిల్‌కు సంబంధించిన ఏర్పాట్లు సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నలుగురు వైద్యులు, ఇద్దరు వైద్యనిపుణులు, ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, ఒక నేత్ర వైద్యాధికారి 15 రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తూ 105రకాల మందులు అందజేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. అవసరమైతే రోగులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. గ్రామ ప్రజలు, పెద్దలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపట్ల అప్రమత్తం

సీతానగరం: వర్షాకాలంలో పశువులనాశించే వ్యాధులపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్య శాఖ సీతానగరం ఏడీఏ సీహెచ్ దీనకుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన సబ్ డివిజన్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు జబ్బవాపు, కాళ్లసంచలు, నోటిసంచలు, గొర్రెలు, మేకల్లో పీపీఆర్ వ్యాధులు వస్తుంటాయని, ఆ వ్యాధులు సంక్రమించకుండా ప్రభుత్వం వ్యాధి నిరోధక టీకాలు ముందుగా సరఫరా చేయడంతో రెండుమండలాల పశువైద్యాధికారుల పర్యవేక్షణలో సిబ్బంది ద్వారా వ్యాక్సినేషన్ చేసినట్లు చెప్పారు. సకాలంలో వ్యాక్సినేషన్ వేయడం వల్ల వ్యాధులు దరిచేరవని తెలియజేశారు. ఇప్పటికే 21 రైతుభరోసా కేంద్రాల్లో అన్ని రకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ప్రభుత్వం సమకూర్చిందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రధానంగా పాడి రైతులు పాడిపశువుల ఆరోగ్య పరిరక్షణకు రెండు మండలాల పశువైద్యాధికారులు డాక్టర్ ఎస్ రామారావు, డాక్టర్ జి.గణేష్‌ల ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యాధికారులు, సచివాలయ పశువైద్య సహాయకులు, సిబ్బంది సహకారంతో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన రైతులు, సర్పంచ్ అప్పలనాయుడు

పాచిపెంట: ప్రభుత్వ భూమి సాగు చేస్తున్న గిరిజనులకు భూ హక్కు కల్పిస్తూ పట్టాలు ఇవ్వాలని మండలంలోని కోటికిపెంట పంచాయతీ వలసలమడ గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. ఈ మేరకు స్థానిక సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతల కాలం నుంచి భూమి సాగు చేస్తున్నప్పటికీ భూ హక్కు పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, బ్యాంకు రుణాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన స్పందనకు 87 వినతులు



వినతిపత్రాలు సమర్పిస్తున్న వారితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందన కార్యక్రమానికి మొత్తం 87 వినతులు వచ్చాయి. కుట్టుమిషన్ ఇప్పించాలని లంగడుగూడకు చెందిన కూర్మారావు, చీపుర్ల యూనిట్ పెట్టుకోవడానికి రుణసాయం చేయాలని పెద్దోడుగూడకు చెందిన ఆనప, తాగునీటి సమస్య పరిష్కరించాలని జక్కర వీధికి చెందిన ధర్మరాజు, హౌసింగ్ బిల్లులు ఇప్పించాలని బీరపాడుకు చెందిన కల్యాణి, సాగుహక్కు పట్టా ఇప్పించాలని ముకుందాపురం రమేష్, అడంగల్ ఇవ్వాలని పెద్దరాజపురానికి చెందిన జగ్గయ్య, పింఛన్ మంజూరు చేయాలని జగ్గడుగూడకు చెందిన మంగయ్య కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. ఐటీడీఏ పీవో కల్పనాకుమారి వాటిని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు కూడా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, పీఏవో హరికృష్ణ పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్



పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం

భామిని: వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ(వైఎస్సార్ సీపీ) గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సోమవారం సమావేశమైన వారు పార్టీ బలోపేతానికి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పార్టీని నమ్ముకున్న వారికి పార్టీలో తప్పకుండా సముచిత గౌరవం లభిస్తుందన్నారు. పదవుల కోసం పనిచేయకూడదని, పార్టీ కోసం పని చేయాలన్నారు.

గతంలో ఏ రకమైన పదవులు లేకుండానే పార్టీని, పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్నామని ఉదహరించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరించడంతో పాటు గతంలో టీడీపీ చేసిన మోసాలను వివరించాలన్నారు. మనమంతా కలిసికట్టుగా పనిచేసి, 2024లో నూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని, అలాగే మన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని కూడా మళ్లీ గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కె.ఆంజనేయులు, ఎంపీటీసీలు పాలక ఉషారాణి, బూస బాలకృష్ణ, సర్పంచ్‌లు మడపాన కేశవ, జామి ప్రభాకర్, బిడ్డికి గౌయింతి, పార్టీ నేతలు కిల్లారి పాల్గుణరావు, ఎరుకుమజ్జి పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూముల రీసర్వే



సర్వే సిబ్బందితో సమావేశమై, సూచనలిస్తున్న తహసీల్దారు సోమేశ్వరరావు

పాలకొండ: పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశమైన ఆయన ఇప్పటివరకు గ్రామాల్లో జరిగిన భూముల రీసర్వేపై సమీక్షించారు. ఈ క్రమంలో మండలంలోని అన్నవరం గ్రామ పరిధిలో జరిగే సర్వేలో వస్తున్న సమస్యలు చర్చకు రాగా, అక్కడి భూ హక్కుదారులు, సర్వే సిబ్బంది మధ్య సమన్వయం కుదిర్చారు. రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలని, పక్కాగా సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేపట్టాలని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టే ఈ సర్వేను రైతులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వేకు వస్తున్న అధికారులకు సహకరించాలన్నారు. మండల సర్వేయర్ వెంకటరావు, డీటీ బుచ్చయ్య పాల్గొన్నారు.

చురుగ్గా ఆరోగ్య సర్వే



ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వేను సమగ్రంగా నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన చిలకలపల్లిలో సర్వేను పరిశీలించారు. జ్వరాలు, దీర్ఘకాలిక వ్యాధులు, ఇతరత్రా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారి వివరాలను సేకరించి వారికి ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సురక్ష పథకాన్ని వర్తింపచేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్షపత్రిపూజ



వెంగాపురంలో లక్షపత్రి పూజలు అందుకున్న స్వామివారు

బలిజిపేట: వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని వెంగాపురం అగ్రహారంలో లక్షపత్రిపూజా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, రుద్రాభిషేకాలు, భారత, భాగవత, విరాట పర్వ పారాయణాలు జరిపిస్తున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలనుంచి భక్తులు వచ్చి స్వామివారికి పూజా ద్రవ్యాలు, పత్రి, పూలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, భక్తులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



గోపాలపురంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మక్కువ: ప్రతి గ్రామంలోని ప్రజలకు ఇంటింటా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఈకార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధి గ్రామాలలో వైద్యసిబ్బంది, గ్రామ వలంటీర్లు పర్యటించి, ఇంటింటికీ వెళ్లి, సర్వేచేసి, రోగులకు వైద్యసేవలందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



108 వాహనంలో చికిత్స పొందుతున్న అందవరపు శ్రీనివాసరావు

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారిలో చిట్టపులివలస జంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరఘట్టానికి చెందిన అందవరపు శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. వీరఘట్టం నుంచి ఆయన స్కూటీపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడు అపస్మారక స్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే స్కూటీ అదుపు తప్పి ప్రమాదం జరిగిందా? ఏదైనా వాహనం ఢీకొట్టడంతో జరిగిందా అనే విషయం తెలియరాలేదు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



ఆలయ అధికారుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కింపు

పాలకొండ: స్థానిక కోటదుర్గమ్మ ఆలయ హుండీలో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి, లెక్కించగా, మొత్తం 43 రోజులకు గాను రూ.5,44,753 వచ్చినట్లు ఆలయ ఈవో మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి కె.వెంకటరమణ, ఆలయ ప్రధానార్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందుబాటులో వైద్యసేవలు



ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో డాక్టర్ శిరీష

సీతానగరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లో రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఆరోగ్య పరమైన సమస్యలున్న వారంతా సేవలను వినియోగించుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ శిరీష పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సూరంపేటలో 104 వైద్య సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా రోగులకు 104 వాహనంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి వైద్యసేవలు అందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులు, బాలింతలు, సీజనల్‌వారీగా వస్తున్న వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఇళ్లవద్దనే వైద్య సేవలు అందిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎం, వైద్యసిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

జోగింపేటలో పారిశుద్ధ్య పనులు



పరిశీలిస్తున్న సర్పంచ్ సింహాచలం

సీతానగరం: మండలంలోని జోగింపేటలో అభివృద్ధి పనులతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ కె.సింహాచలం అన్నారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలగించిన చెత్తను గ్రామ శివారుకు తరలిస్తున్నామన్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న నీడనిచ్చే మొక్కల సంరక్షణకు, మొక్కల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామన్నారు. జీజీఎంపీ నిధులతో చేపడుతున్న పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి యంత్రాలతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అలాగే తాగునీరు సౌకర్యం కల్పించేందుకు ఇంటింటి కుళాయి నిర్మాణం పథకం ద్వారా ప్రతి ఇంటి ముంగిట కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి



మిర్తివలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు పాటుపడాలని ఎంఈఓ–1 సామల సింహాచలం పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలస ఎంపీపీ పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా పర్యవేక్షించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వెలిబుచ్చారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని సూచించారు. లెసన్‌ప్లాన్స్, వర్క్‌బుక్స్‌లో దిద్దుబాట్లు, రికార్డుల తనిఖీలు చేశారు. విద్యార్థులచేత పాఠ్యాంశాలు చదివించారు. వారికి వివిధ అంశాలలో ఉండే నైపుణ్యాలను వివరించారు. ప్రతి విద్యార్థికి రాత, చదువు కచ్చితంగా వచ్చే విధంగా తీర్చిదిద్దాలన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. పాఠశాలల తనిఖీ నిర్వహించి రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న శునకాలు



మక్కువలో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాలు

మక్కువ: మండలకేంద్రం మక్కువలో శునకాలు వీర విహారం చేస్తున్నాయి. ఎక్కడ నుంచి వచ్చాయో గాని, గుంపులు, గుంపులుగా శునకాలు ప్రధానరహదారితో పాటు, వీధుల్లో తిరుగుతుండడంతో కాలినడకన వెళ్లేవారు, వాహనాలపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానరహదారి మధ్యలో గుంపులుగా శునకాలు ఉండడంతో, ఎక్కడ వాహనాల వెంట పడతాయోనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. రాత్రివేళ గట్టిగా అరుస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను తరిమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యాబోధనలో భాషోపాధ్యాయుని పాత్ర కీలకం

- ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి ఎ.లిల్లీరాణి

సీతంపేట: విద్యాబోధనలో తెలుగు భాషోపాధ్యాయుని పాత్ర చాలా కీలకమని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి ఎ.లిల్లీరాణి అన్నారు. సోమవారం స్థానిక బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె నాణ్యమైన విద్యాబోధనకు పలు సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, అందరికీ అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న మెలకువలను తరగతి గదిలో పాటిస్తూ విద్యార్థులకు ఉత్తమ బోధనా పద్ధతుల్లో బోధన చేయాలన్నారు. అనంతరం పద్యబోధన, గద్యబోధన, వ్యాకరణాంశాలు, పాఠ్యప్రణాళిక, ప్రశ్నపత్రం తయారీపై డీఆర్‌పీలు ఎం.తాతయ్య, పి.కోటిబాబు, ఎ.కామేశ్వరరావు, గోపాలరావు, కూర్మాచార్యులు, కైలాశరావు, పట్నాయక్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మంగవేణి, ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవి, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.